కాయకల్ప అవార్డులో తాండూరు ఆసుపత్రి హ్యాట్రిక్



తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరు జిల్లా ఆస్పత్రి వరుసగా మూడుసార్లు కాయకల్ప అవార్డు అందుకుని హ్యాట్రిక్ ఘనత సాధించింది. 2021లో మొదటిసారి, 2022లో రెండోసారి, తాజాగా మూడోసారి అవార్డు రావటంపై వైద్య బృందం సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ రవి శంకర్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది, పిల్లల వార్డు బాయ్స్, పారిశుద్ధ్య, భద్రతా సిబ్బంది ఇలా ప్రతి ఒక్క విభాగానికి చెందిన వారు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించటంతోనే ఈ ఘనత దక్కిందన్నారు. నగదు పురస్కారం కింద ప్రభుత్వం ఇచ్చే రూ.25లక్షలను ఆస్పత్రి అభివృద్ధికి వినియోగించి, రోగులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

రూ.10 కోట్లతో సౌర విద్యుత్తు సరఫరా



కొండారెడ్డిపల్లిలో ముషారఫ్ ఫారుకి, ప్రతీక్‌జైన్

కొడంగల్, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి సౌర (సోలార్) విద్యుత్తు అందించేందుకు ప్రయోగాత్మకంగా మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారుకి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం వారు ఈ గ్రామాన్ని సందర్శించి పథకం అమలు ఏర్పాట్లు, ప్రయోజనాల గురించి ప్రజలతో మాట్లాడారు. ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్తు అందించేందుకు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.10 కోట్ల వరకు ఖర్చు అవుతుందన్నారు. కేవలం ఇళ్లకు సంబంధించి 153 కుటుంబాలకు ఈ సరఫరా అందనుందన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ సీఈ అనంద్, ఎస్ఈ సంజీవ్‌రెడ్డి, టీజీ రెడ్‌కో ఛైర్మన్ అనిల, ఏడీఈ నవీన్‌కుమార్, ఏఈ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో డిజిటల్ సర్వే పూర్తి



పరిగిలో సర్వే పరిశీలిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

కొడంగల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించనున్న డిజిటల్ కార్డులకు సంబంధించిన సర్వే గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో కొనసాగుతున్న సర్వే పనులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌లు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపల్‌లో ఒక వార్డును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ అధికారులు అంజనేయులు, మహిళా సమాఖ్య సభ్యులు ఆనందమ్మ తదితరులు పాల్గొన్నారు. **పరిగి:** డిజిటల్ సర్వే మున్సిపాలిటీలో గురువారం ప్రారంభమైంది. తొలిసారిగా టీచర్స్ కాలనీలో పుర అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. దీనిని వికారాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి వాసుచంద్ర పరిశీలించారు. తహసీల్దారు ఆనందరావు, కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బియ్యం కుతకుత.. నూనె సలసల

సిద్దిపేటకు చెందిన సురేశ్ చిరుద్యోగి. చిన్నపాటి వేతనంతో ఆరుగురు కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు. ప్రతి నెలా ప్రణాళికతో వెచ్చిస్తుంటారు. ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులకు పక్కాగా ఖర్చుపెడుతుంటారు. కొన్నాళ్లుగా పెరిగిన ధరలతో లోటు బడ్జెట్ ఎదుర్కొంటున్నారు. నిత్యావసర ధరలు అమాంతం పెరగడంతో ప్రతి నెలా రూ.3 వేలు ఖర్చు చేయగా.. కొన్నాళ్లుగా ఆ పద్దు రూ.4,500కు పెరిగింది.

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్:

నూనె ధర చేజారుతోంది.. బియ్యం ఉడకనంటోంది.. పప్పు బద్ధకిస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న నిత్యావసర ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాలు బేజారవుతున్నాయి. ప్రతి నెలా నిర్వహణ ఖర్చులు భారంగా మారుతున్నాయి. ఇంటి సారథి.. కుటుంబాన్ని వెళ్లదీసేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న ధరలతో షాక్‌కు గురవుతున్నారు. పెద్ద పండగలైన దసరా, దీపావళి వచ్చేశాయి. పండగల వేళ జనమంతా ఇబ్బందులకు గురవుతున్నారు.

దడ పుట్టిస్తోంది..



పెరుగుతున్న బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. క్వింటాకు రూ.500 నుంచి రూ.వేయి వరకు పెరిగింది. నెల వ్యవధిలో పెరుగుదల ప్రభావం చూపింది. ఐదుగురు ఉండే ఇంట్లో నెలకు కనీసం 40 నుంచి 50 కిలోల బియ్యం వాడుతారు. పాత సన్నబియ్యం ధరలు భారీగా పెరగడంతో దొడ్డురకం వైపు మళ్లుతున్నారు.

సన్న బియ్యం ధర (రూ.లలో..)	
గతేడాది	5500
ప్రస్తుతం	7000

పండుగల వేళ ధరల దడ

కొనలేక..

ఎండు కొబ్బరి వంటకాల్లో రుచిని పెంచుతుంది. చిక్కదనాన్ని, పోషకాలను అందిస్తుంది. పది రోజుల్లో ధర అమాంతం పెరిగింది. ఆరు నెలల్లో పప్పుల ధరలు పెరిగాయి. మరోవైపు కిలో నువ్వులు రూ.180కు చేరింది. చక్కెర రూ.41, గోధుమపిండి రూ.40, రవ్వ- రూ.42 పలుకుతోంది. గతంతో పోలిస్తే రూ.5 పెరిగినట్లు స్పష్టమవుతోంది. కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి.

నిత్యావసరం	గతేడాది	ప్రస్తుతం (రూ.లలో..)
ఎండుకొబ్బరి	140	220
కంది పప్పు	140	180
పెసర పప్పు	110	130
శనగ పప్పు	80	120
చక్కెర	38	42
చింతపండు	100	140



20 శాతం పెరిగి..





వంటనూనె ధరలకు రెక్కలొచ్చాయి. 15 రోజుల్లోనే 20 శాతానికి పైగా పెరిగింది. ఈ మార్పు స్పష్టమైంది. సన్ ఫ్లవర్, రైస్ బ్రాన్, పల్లీ నూనె కొనలేని పరిస్థితి. ప్రతి నెలా సగటున 5 కిలోలు వినియోగించగా.. ఇప్పుడు 3 కిలోలకు తగ్గించేందుకు చూస్తున్నామని గజ్వేల్‌కు చెందిన మారుతి చెప్పుకొచ్చారు. పండుగ సీజన్‌లో పిండి వంటలకు నూనె వినియోగం తప్పనిసరి కావడంతో ఏం చేయాలన్న మీమాంసలో పడిపోతున్నారు.

నూనె ధర (రూ.లలో..)	
గతేడాది	110
ప్రస్తుతం	135

నిత్యావసర ధరలు తగ్గాలంటే ఏం చేయాలి?

జిల్లాలో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన 100 మందితో 'న్యూస్‌టుడే' నిర్వహించిన సర్వేలో ఇలా స్పందించారు.





ప్రభుత్వం నుంచి మీరు కోరుకునేది?



ధరలతో భయమేస్తోంది: గూడెపు మంజుల, కూలి, పాలేపల్లి, దోమ



గతంలో ఊళ్లలో పండించే కూరగాయలు, పప్పులూ, ఉప్పులూ అందరికీ అందుబాటు ధరలకు దొరికేవి. అలాంటిది పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. రెండు రోజుల కష్టంతో చేతికి వచ్చిన డబ్బులు తీసుకుని అంగడి వెళ్తే కనీసం కూరగాయలు రావడం లేదు.

కట్టడి చేయాలి..: స్వాతి, గృహిణి, దౌల్తాబాద్

మార్కెట్‌కు వెళ్తే నూనెలు, పప్పుల ధరలు చూసి బెంబేలెత్తిపోతున్నాం. కూరగాయలను సైతం కొనలేకపోతున్నాం. చేతిలో ఉన్న డబ్బుతోనే ధరలు కాస్త తక్కువగా ఉన్నవాటిని తీసుకుని సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ధరలను కట్టడి చేయాలి.

గేటుకు తాళం.. ప్రహరీ ధ్వంసం



మండలంలోని జనగాం గ్రామంలోని పాఠశాలలో 'మన ఊరు మనబడి' కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలి ఇబ్బందులకు దారితీస్తున్నాయి. నిధులు మంజూరు కాకపోవడంతో పాఠశాల యాజమాన్య నిర్వాహకులు పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. ప్రధాన ద్వారం పనులు చేపట్టిన సమయంలో ప్రహరీ కూల్చి పక్క నుంచి దారిని ఏర్పాటు చేశారు. పనులు ఆపేయడంతో గేటుకు తాళం అలాగే ఉంది. విద్యార్థులు పక్క దారి మీదుగా వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో అసాంఘిక కార్యాకలపాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

\- న్యూస్‌టుడే, పెద్దేముల్

శైలపుత్రీ.. నమోస్తుతే..



వికారాబాద్ వైభవలక్ష్మి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈనెల 12 (శనివారం) వరకు కొనసాగుతాయని ఆలయ వ్యవస్థాపకులు స్వరూప, రమేశ్ దంపతులు తెలిపారు. మొదటి రోజు అమ్మవారిని శైలపుత్రీ దేవి (భువనేశ్వరీ దేవి)గా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

\- న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ

పత్తికి తెగుళ్లు.. నల్లబారిన కంది



ఇటీవలి అధిక వర్షాలతో భూమిలో తేమ ఎక్కువై పత్తి పంటకు ఆకు మడత, ఇతర తెగుళ్లు సోకి మొక్క ఎదుగుదల తగ్గింది. ఇప్పటి వరకు కాసిన పూత రాలిపోగా, కాయలు నల్లబారి బూజుపట్టాయి. కంది మొక్కలు నల్లబారి ఎండిపోయాయని రైతులు వాపోతున్నారు. పత్తికి ఇప్పటి వరకు ఎకరాకు రూ.10వేల వరకు పెట్టుబడి పెట్టామని, కనీసం పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంది, మినుము, పెసర పంటలు సైతం నీట మునిగి పాడయ్యాయన్నారు.

\- న్యూస్‌టుడే, బషీరాబాద్

ముఖ్యమంత్రిని కలిసిన గ్రంథాలయ ఛైర్మన్



కొడంగల్, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన రాజేష్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల రాంచంద్రారెడ్డి, వెంకటరాములుగౌడు, జయకృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించండి



మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమాధికారిణి క్రిష్ణవేణి

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మానవుడి జీవితంలో వయోవృద్ధుల దశ గొప్పదని, ఈ దశలో వారిని గౌరవించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారిణి క్రిష్ణవేణి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలల హక్కుల సంక్షేమ కమిటీ ఛైర్మన్ వెంకటేశం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వృద్ధుల కోసం కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు వెంకటేశ్వరమ్మ, రజిత, జహీరోద్దీన్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వివరాల సేకరణలో పొరపాట్లు రావొద్దు

యాలాల, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యుల డిజిటల్ కార్డుల తయారు నేపథ్యంలో లబ్ధిదారుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం తాండూరు యాలాల మండలంలోని పగిడిపల్లి గ్రామాన్ని డిజిటల్ కార్డు నమోదుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో ఎమ్మార్వో అంజయ్యతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించి మాట్లాడారు. కుటుంబ వివరాలను జాగ్రత్తగా సేకరించాలని, ఎవరికీ ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. సిబ్బంది వివరాల సేకరణలో పొరపాట్లు చేయరాదన్నారు. ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



నవీన్‌రెడ్డికి మిఠాయిలు తినిపిస్తున్న అరవింద లింబావళి, చిత్రంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

తాండూరు గ్రామీణ: కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి, ఆలయ నిర్మాణకర్త అరవింద లింబావళి అన్నారు. ఆలయ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు గురువారం అట్టహాసంగా నిర్వహించారు. అధ్యక్షులుగా పట్లోళ్ల నవీన్‌రెడ్డితోపాటు కార్యవర్గ సభ్యులుగా రాజు, లాలయ్య, శాంతప్ప, లక్ష్మి, లాల్యానాయక్, ఈశ్వరమ్మలచేత తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి సమక్షంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా లింబావళి విచ్చేసి నూతన అధ్యక్షుడిని శాలువాతో సన్మానించి మిఠాయిలు తిన్పించి మాట్లాడారు. తాండూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ముందుకొచ్చిన కర్ణాటక మాజీ మంత్రికి అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. డీసీసీబీ ఉపాధ్యక్షులు రవీందర్‌గౌడ్, వ్యవసాయ విపణి అధ్యక్షులు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షులు జన్నెనాగప్ప, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఉత్తమ్‌చంద్, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత మరిచి.. మామూళ్లకు తెగించి..

పోలీసుశాఖకు మచ్చ తెస్తున్న పలువురు అధికారులు



జిల్లా పోలీసు కార్యాలయం

న్యూస్‌టుడే, వికారాబాద్, తాండూర్: సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ అందరికీ అండగా నిలవాల్సిన పోలీస్ శాఖ ఉద్యోగులు పలువురు బాధ్యతను విస్మరిస్తూ శాఖకు చెడ్డపేరు తెస్తున్నారు. జిల్లాలో ఓ సీఐపై సస్పెన్షన్ వేటు, ఇద్దరు సీఐలు, మరో ఇద్దరు ఎస్ఐలను ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేస్తూ గురువారం పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలు కలకలం రేపాయి. ఒకేసారి ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలపై చర్యలు తీసుకోవడం జిల్లాలో ఇదే ప్రథమం.

అవినీతి మరక..

వికారాబాద్ పట్టణ సీఐగా నాగరాజు బాధ్యతలు స్వీకరించక ముందు జోగిపేట సీఐగా పని చేశారు. ఆ సమయంలో ఓ బాలిక అత్యాచారం కేసులో అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డాడని విచారణలో తేలింది. దీంతో అతనిపై సస్పెన్షన్ వేటు పడింది.

- ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో విఫలమవడంతో పాటు ప్రోత్సహిస్తున్నారని విచారణలో తేలడంతో తాండూర్ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్, పెద్దేముల్ ఎస్ఐ గిరెన్న, యాలాల్ ఎస్ఐ శంకర్‌లను ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేశారు.

రాత్రికి రాత్రే తోడేస్తున్నారు

జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా విషయంలో పోలీసులు చూసీ చూడనట్లు పోతున్నారనే విమర్శలున్నాయి. సమీప వాగుల్లోని ఇసుకను రాత్రికి రాత్రే తోడేస్తున్నారు. యాలాల్ మండల పరిధిలోని కాగ్నా, కాక్రవేణి వాగుల నుంచి తాండూర్, పెద్దేముల్, బషీరాబాద్, ధారూర్ మండలాలకు అక్రమంగా ఇసుక తరలిపోతోంది. ధారూర్ మండల పరిధిలో ఉన్న చిన్నచిన్న వాగుల నుంచి, నవాబుపేట మండల పరిధిలో ఉన్న మూసీ నది నుంచి ఇసుక రవాణా జరుగుతోంది.

- గతంలో యాలాల్ ఎస్ఐ ఇంటి ఎదుట ఇద్దరు ఇసుక వ్యాపారులు ఇసుక రవాణా విషయంలో ఎస్ఐ సమక్షంలోనే గొడవకు దిగి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ సదరు ఎస్ఐని విధుల నుంచి తప్పించి ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేశారు.
- ఓ ప్రజాప్రతినిధి తాండూర్ పట్టణ సీఐని ఇసుక అక్రమ రవాణాకు సహకరించి భారీగా ముడుపులు తీసుకుంటున్నావంటూ ఫోన్‌లో దుర్భాషలాడిన సంభాషణ సామాజిక మాధ్యమాల్లో గతంలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయండి

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. గురువారం సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో దృశ్యమాధ్యమ సమావేశం ద్వారా వివిధ అంశాలను సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ దొడ్డు, సన్న రకాలను వేర్వేరుగా సేకరించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. సేకరణ కేంద్రాల్లో తాడిపత్రులు, తేమను పరిశీలించే యంత్రాలు, అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, శిక్షణ కలెక్టరు ఉమాహారతి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీసీఎస్ మోహన్‌బాబు, డీఎంసీఎస్ విజయలక్ష్మి, వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ ధ్రువ పత్రాల పరిశీలన రెండు రోజులే..

వికారాబాద్ మున్సిపాలిటీ: డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను ఈనెల 5 లోపు పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవిని కలెక్టర్ ఆదేశించారు. ఎంపికైన 1:3 నిష్పత్తి అభ్యర్థుల జాబితాను జిల్లా కలెక్టర్ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. వారికి కేటాయించిన కేంద్రాల్లో ధ్రువ పత్రాల పరిశీలన చేపట్టాలన్నారు.

నేడు టార్చ్‌రిలే ర్యాలీ

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రారంభించిన టార్చ్ రిలే ర్యాలీ నేడు వికారాబాద్‌కు చేరుకుంటుందని జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు కలెక్టర్ కార్యాలయం నుంచి సంగారెడ్డి జిల్లాకు బయలుదేరుతుందని ఆయన పేర్కొన్నారు.

పొరపాట్లు సరిచేసుకోండి

కొడంగల్, న్యూస్‌టుడే: తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో నమోదైన పేర్లు చూసుకోవాలనీ, తప్పులుంటే సరిచేసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకొనేందుకు ప్రధానంగా యువతలో చైతన్యం తేవాలన్నారు.

పాముకాటు రక్షణపై అవగాహన

వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: వర్షాకాలంలో పాముల నుంచి రక్షించుకునేందుకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమం ఎంతో మేలు చేస్తుందని డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్ అభిప్రాయపడ్డారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో అటవీ శాఖ సిబ్బందికి, స్వామి నారాయణ్ గురుకుల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరానికి చెందిన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ ప్రతినిధులు పాముకాటు వేసిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ అధికారులు శ్యాంకుమార్, ప్రతిమ, రాజేందర్‌లు పాల్గొన్నారు.

సభ్యత్వాల నమోదులో ప్రథమ స్థానంలో నిలవాలి

న్యూస్‌టుడే, తాండూరు, తాండూరు టౌన్ : భాజపా సభ్యత్వాల నమోదులో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని రాష్ట్ర భాజపా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ అన్నారు. గురువారం భాజపా శ్రేణులు తాండూరులో నిర్వహించిన సభ్యత్వాల నమోదులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, భాను ప్రకాష్, శ్రీనివాస్, కృష్ణ, భద్రేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే చేపట్టాలి


మంగంపేటలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ప్రత్యేకాధికారిణి హరిచందన

జిన్నారం, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని మంగంపేటను ఎంపిక చేయడంతో గురువారం నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వేను జిల్లా ప్రత్యేకాధికారిణి హరిచందన పరిశీలించారు. మూడు బృందాలుగా ఏర్పాటై కార్డుల జారీ కోసం వివరాలు సేకరిస్తున్న తీరును తహసీల్దార్ భిక్షపతి ఆమెకు వివరించారు. ఇంట్లో మొత్తం సభ్యులు, కార్డు యజమానిగా మహిళ ఉండేలా ఈసారి కుటుంబ తెలుసుకుంటారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. గ్రామంలో 179 కుటుంబాలుండగా మొదటి రోజు 134 పూర్తయ్యాయి. ఎంపీడీవో అరుణారెడ్డి, ఎంపీవో రాజ్‌కుమార్, తదితర అధికారులకు హరిచందన పలు సూచనలు చేశారు. లోపాలు లేకుండా కార్డు ప్రక్రియ జయప్రదం చేయాలని ఆదేశించారు. పటాన్‌చెరు నియోజకవర్గ నోడల్ అధికారి దేవుజా తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో ఎదిగి.. ఐక్యతతో ఒదిగి

సద్వినియోగం గంతో భవిత ఖాయం

విద్యార్థి దశలో కీలకంగా ఎన్‌సీసీ

న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి టౌన్, మెదక్ టౌన్, వికారాబాద్ టౌన్

సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్దకు చెందిన జి.సతీశ్ కుమార్ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత దాడి డిగ్రీ పూర్తిచేశారు. 2023లో తృతీయ సంవత్సరం చదువు తున్నప్పుడే పోలీసు కానిస్టేబుల్ (సివిల్) పరీక్ష రాసి లక్ష్యాన్ని సాధించారు. 9వ తరగతిలో ఎన్‌సీసీలో చేరడం కలిసొచ్చింది. దీని కోటా కింద కొలువుకు దరఖాస్తు చేసుకోగా.. మార్కులు కలిశాయి. ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు.

ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారు పేరు. విద్యార్థి దశలో జాతీయ భావాలు పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. సమగ్రతకు బాట వేసేలా.. ఏకతా నినాదాన్ని వినిపిస్తుంది. సేవ వైపు మళ్లిస్తుంది. గొప్ప వ్యక్తిత్వంతో ఉన్నత శిఖరాల్లో రాణించేందుకు బాటలు వేస్తుంది. ఆ దిశగా ఉమ్మడి జిల్లా సంస్థల్లో నేషనల్ కేడెట్ కార్ప్స్ (జాతీయ విద్యార్థి సైనిక దళం) కీలకపాత్ర పోషిస్తోంది. డిగ్రీ దశలో ఈ బృందాలు.. ప్రభావవంతంగా, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 17 డిగ్రీ కళాశాలలు, పాఠశాలల్లో ఎన్‌సీసీ అమలవుతోంది. 1546 మంది విద్యార్థులు కేడెట్లుగా కొనసాగుతున్నారు. సిద్దిపేట నుంచి నలుగురు ప్రతిష్టాత్మక ఎన్‌సీసీ ప్రత్యేక డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు ఇప్పటి వరకు 21 మంది అగ్నివీర్‌లో చేరారు. ఏటా పోలీసు లేదా ఆర్మీలో 10 మంది కొలువులు సాధిస్తున్నారు. మెదక్, సంగారెడ్డిలోనూ కేడెట్లు ఉద్యోగాలు సాధిస్తున్నారు.


ఎన్‌సీసీ విద్యార్థులు

జిల్లాల వారీగా ఇలా..

కేడెట్లు	డిగ్రీ కళాశాలలు	
600	7	సంగారెడ్డి
700	4	సిద్దిపేట
160	1	మెదక్
86	2	వికారాబాద్

శిక్షణ.. బాధ్యతలు


- విద్యాసంవత్సరం మొత్తంలో కేడెట్లకు 40 వరకు తరగతులు నిర్వహిస్తారు.
- కవాతు, మ్యాప్ రీడింగ్, సాయుధ శిక్షణ, సామాజిక సేవలో తప్పనిసరిగా భాగస్వాములయ్యేలా చూస్తారు.
- విపత్తులు, ఇతర సందర్భాల్లో సేవ చేయాల్సి ఉంటుంది.
- వారంలో రెండు గంటలు తరగతులు, డ్రిల్ సాధన చేయాలి.
- ఏడాదిలో ఒకసారి ప్రాక్టికల్, థియరీ పరీక్షలు ఉంటాయి.
- పాఠశాల స్థాయిలో ఏ, డిగ్రీ స్థాయిలో బీ, సీ ధ్రువపత్రాల పరీక్షలు ఉంటాయి. ప్రతి ఏటా ఒక శిబిరానికి హాజరు కావాలి.


సాయుధ శిక్షణలో కేడెట్లు

జనరల్ ఎలక్టివ్ పేపర్..

గతంలో ఎన్‌సీసీ సహ పాఠ్య కార్యక్రమంగా కొనసాగించారు. గతేడది నుంచి దీన్ని కోర్సులో ఒక పేపర్‌గా గుర్తించారు. గత విద్యాసంవత్సరంలో ఎన్‌సీసీని ఒక పేపర్‌గా గుర్తించాలని యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) అన్ని వర్సిటీలను సూచించింది. జనరల్ ఎలక్టివ్ (జీఈ) పేపర్‌గా డిగ్రీ తృతీయ సంవత్సరంలో విద్యార్థులు ఎంచుకోవచ్చు. ఇతర పేపర్ల మాదిరి గానే క్రెడిట్లు (మార్కులు) పొందే వీలుంది. ఉన్నత విద్యలో చేరేందుకు 'సి' సర్టిఫికెట్‌ను ఉపయోగించుకుంటున్నారు.


ఉన్నత పోరులుగా..



ఎన్‌సీసీలో చేరిక ఎంతో ఉపయోగకరం. మానసికంగా, శారీరకంగా దృఢంగా మారుతారు. సమస్యలు ఎదురైనా తట్టుకుని నిలబడే సామర్థ్యం కలిగి ఉంటారు. ఉన్నత విద్య, ఉద్యోగంలో మంచి అవకాశాలు ఉంటాయి. అన్ని కళాశాలల్లో అందుబాటులోకి తెస్తే మేలు.

లెఫ్టినెంట్ మహేందర్‌రెడ్డి, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి, గజ్వేల్

సద్వినియోగం చేసుకోవాలి:



విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దేశభక్తి చాటేందుకు ఇదో వేదికని గుర్తుంచుకోవాలి. విద్యార్థులకు క్రమశిక్షణ కూడా అలవడుతుంది. ఉన్నత లక్ష్యాలను సులువుగా చేరుకుంటారు.

విజయ, ఎన్‌సీసీ అధికారి, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డి

ప్రయోజనాలు..

- విశ్వవిద్యాలయాల్లో కోటా కింద ఉన్నత విద్యలో ప్రవేశం పొందవచ్చు.
- వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే శిబిరాల ద్వారా జాతీయ సమైక్యతా భావం పెరుగుతుంది.
- దేశ రక్షణ విభాగాల్లో చేరడం సులువు.
- సర్టిఫికెట్ ఆధారంగా పోలీసు శాఖ, ఆర్మీలో ప్రాధాన్యం ఇస్తారు.
- దిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ శిబిరంలో పాల్గొని కవాతు చేయవచ్చు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వృద్ధురాలి మృతి

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని రాయిలాపూర్‌కు చెందిన అన్నబోయిన సావిత్రి (65) గత నెల 28న దుబ్బాకకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. గ్రామ శివారులో కుక్కలు అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. సావిత్రిని ములుగు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మరో ఘటనలో యువకుడు..


నవీన్

కంది: ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్సై వినోద్ కుమార్ తెలిపిన వివరాలు.. కంది మండలం చిమ్నాపూర్‌కు చెందిన ఎర్రవల్లి నవీన్(36) ఐటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నారు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో కుక్కలు అడ్డురావడంతో కింద పడ్డారు. ఈ ప్రమాదంలో తలకు గాయాలు కాగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనతో ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య శిరీష సంగారెడ్డి రూరల్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

చికిత్స పొందుతూ మహిళ..


లక్ష్మి

మిరుదొడ్డి: ద్విచక్ర వాహనంపై నుంచి పడి గాయాలైన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. భూంపల్లి ఎస్సై హరీశ్ తెలిపిన వివరాలు.. మిరుదొడ్డి మండలం అల్వాలకు చెందిన లక్ష్మి భర్తతో కలిసి గతనెల 25న ద్విచక్ర వాహనంపై మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంటకు బయలుదేరారు. అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతారెడ్డిపేట శివారులో బైక్ అదుపుతప్పి కింద పడగా లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పాము కాటుకు బాలుడి బలి


మణికేశ్వర్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: పాము కాటుతో బాలుడు మృతి చెందిన ఘటన సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన తుమ్మల శ్రీనివాస్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమారుడు మణికేశ్వర్(7) ఉన్నారు. శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం 20రోజుల కిందట గల్ఫ్ వెళ్లాడు. లక్ష్మి బీడీ కార్మికురాలిగా పని చేస్తోంది. బడికి సెలవులు కావడంతో గురువారం మణికేశ్వర్ తల్లి వెంట బీడీ కంపెనీకి వెళ్లాడు. అక్కడ ఖాళీ స్థలంలో బాలుడు ఆట్లపెట్టెను తీస్తుండగా, నాగుపాము కాటు వేసింది. ఈ విషయాన్ని అక్కడున్న వారు గమనించలేదు. కాలుకు ఏదో గుచ్చుకుంది అని భావించారు. ఇంటికి వెళ్లే సరికి మణికేశ్వర్ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందాడని నిర్ధారించారు. గ్రామస్థులంతా బీడీ కంపెనీ వద్దకు వెళ్లి, ఖాళీ అట్లపెట్టెలను తొలగించి చూడగా నాగుపాము కనిపించింది. పాము కాటుతోనే బాలుడు మరణించాడన్నారు. మణికేశ్వర్ ఒక్కడే తాతకు చదువుతున్నాడు. చిన్నారి మృతితో విషాదం అలుముకుంది.

సాంకేతికత తోడుగా విద్యుత్తు సేవలు



విద్యుత్తు వినియోగదారులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో టీజీ ఎన్పీడీసీఎల్ అడుగులేస్తోంది. ఇందులో భాగంగా సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వినియోగంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. వినియోగదారుడు తన అరచేతిలో ఉండే చరవాణి నుంచే పలు రకాలుగా వినియోగించుకునే అవకాశం ఉంది. నూతన సాంకేతికతను జోడించి వినియోగదారుల సౌకర్యార్థం 19 రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకు చేయాల్సిందల్లా స్మార్ట్‌ఫోన్‌లో కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుంది. సంబంధిత అధికారులు దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు దీనిద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

ఏ మేర పెరిగిందో..: ఇందులో బిల్లు కాలిక్యులేటర్‌ను సైతం అందుబాటులో ఉంచారు. ఎన్ని యూనిట్లు వాడితే ఎంత బిల్లు వస్తుంది, యూనిట్లు వ్యవధిని బట్టి ఛార్జీ వివరాలు తెలుసుకోవచ్చు. ఆయా ఆప్షన్లతో పాటు కొత్త కనెక్షన్ పొందడం, పేరు, లోడు మార్పు, విద్యుత్తు నిబంధనలు, టారిఫ్ వివరాలు, ఏ విభాగానికి ఎంత ఛార్జి, గృహ, గృహేతర, పరిశ్రమలు తదితర వివరాలు చూసుకోవచ్చు. పొదుపు, సూచనలూ పొందుపరిచారు. ప్రమాదం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగదారుల ఫీడ్ బ్యాక్ కూడా ఇచ్చే వీలుంది. టోల్ ఫ్రీ నంబరు సైతం పొందుపరిచారు.

- న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

యాప్‌లో ఇలా..

రిపోర్టు ఆన్ ఇన్సిడెంట్: ఎక్కడైనా ఏదైనా ప్రమాదం, మరమ్మతులు జరిగితే జీపీఎస్ లోకేషన్‌తో చరవాణిలో ఫొటో తీసి అధికారులకు పంపించవచ్చు. సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదు నమోదు: వినియోగదారులు తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు. మీటరు నంబరు, సమస్య రాస్తే దాన్ని పరిష్కరిస్తారు. అది ఏ స్థాయిలో ఉందో కూడా తెలుసుకోవచ్చు. ఒకవేళ సమస్య తీరకపోతే మరో సారి ఫిర్యాదు చేయవచ్చు.

సెల్ఫ్ రీడింగ్: ప్రతి నెల విద్యుత్తు సిబ్బంది వచ్చి మీటరు రీడింగ్ తీస్తారు. అలా కాకుండా వినియోగదారుడే నేరుగా మీటరు రీడింగ్ తీయవచ్చు. ఎంత మేర విద్యుత్తు వాడాం, ఏ మేర బిల్లు వచ్చిందో తెలుసుకోవచ్చు.

బిల్లు చెల్లింపు: యాప్ ద్వారా బిల్లు చెల్లించవచ్చు. ఆయా వివరాలు వెంటనే చూసుకునే వీలుంది. గతంలోని వివరాలూ తెలుసుకోవచ్చు.

ఆధార్ లింక్: విద్యుత్తు మీటరుకు ఆధార్‌తో పాటు చరవాణి నంబరు అనుసంధానం చేసి ఉంటే ప్రతి నెలా బిల్లు, ఇతర వివరాల సందేశాలు వస్తాయి. అధికారులు ఇప్పటికే ఆయా వివరాలు నమోదు చేశారు. అయితే చాలా మంది నమోదు చేసుకోలేదు. అలాంటి వారు యాప్‌లో వాటిని నమోదు చేసుకోవచ్చు.

విధుల్లో నిర్లక్ష్యం.. పోలీసు అధికారులపై వేటు

వికారాబాద్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా, విధులలో నిర్లక్ష్యం.. వెరసి వికారాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్సైలపై పోలీసు శాఖ చర్యలకు ఉపక్రమించింది. వికారాబాద్ పట్టణ సీఐ నాగరాజును సస్పెండ్ చేయగా, తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్‌లను ఐజీ కార్యాలయానికి, యాలాల, పెద్దేముల్ ఎస్సైలు శంకర్, గిరస్వామిలను ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం(అటాచ్) చేస్తూ మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. జోగిపేట సీఐగా విధులు నిర్వర్తిస్తున్న తరుణంలో వికారాబాద్ సీఐ నాగరాజు ఓ మైనర్‌పై జరిగిన అత్యాచారం కేసులో విధుల పట్ల నిర్లక్ష్యం, అవకతవకలకు పాల్పడటంతో పాటు కేసును నీరుగార్చేలా దర్యాప్తు చేశారన్న అభియోగాలతో సస్పెన్షన్ వేటు వేశారు. తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్, యాలాల, పెద్దేముల్ ఎస్సైలు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలం, ఇతర కారణాలతో శాఖాపరమైన చర్యల్లో భాగంగా అనుసంధానం చేశారని పోలీస్ వర్గాలు తెలిపాయి.

సంగారెడ్డిలో ఇద్దరిపై..

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన ఇద్దరు పోలీసు అధికారులపై వేటు పడింది. సంగారెడ్డి గ్రామీణ సీఐ అశోక్, ఎస్సై వినయ్‌కుమార్‌ను వీఆర్‌కు అటాచ్ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి, కంది మండలంలోని నక్క వాగు పరిధిలో కృత్రిమ ఇసుక తయారీ జోరుగా సాగుతోంది. అనుమతులేవీ లేకుండా తవ్వుతుండడంతో పర్యావరణం దెబ్బతినడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని నిఘా వర్గాల ద్వారా పోలీసు శాఖ సమాచారం సేకరించింది. అక్రమార్కులకు సీఐ, ఎస్సై ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడంతో చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఆన్‌లైన్ బెట్టింగ్.. వ్యాపారి..


నవీన్

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో నష్టపోయిన వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట- భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పరుశురాములు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన ఈదారి నవీన్ (27) ఎరువులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సులువుగా ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మరలి, రూ.26 లక్షల అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. వాటిని తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపానికి గురైన పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవీన్‌కు భార్య రాధిక, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కడుపు నొప్పి భరించలేక మహిళ..

బెజ్జంకి, న్యూస్‌టుడే: కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని గుగ్గిళ్లకు చెందిన కనకవ్వ(38)కు భర్త సంపత్, ముగ్గురు కుమార్తెలు ఉండగా, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మూడేళ్ల కిందట అనారోగ్య సమస్యలతో ఆమెకు శస్త్రచికిత్స చేసినా గర్భసంచిని తొలగించారు. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది గురువారం పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. 108 వాహనంలో కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

రైలుకిందపడి గుర్తు తెలియని వృద్ధుడు..

తాండూరు టౌన్: రైలుకింద పడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాండూరులో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం రైల్వే యార్డు సమీపంలో 60 ఏళ్ల వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహంపై నలుపు, ఎరుపు, తెలుపు రంగు స్వెట్టరు ఉంది. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి శవాగారంలో భద్రపరిచారు.

అనారోగ్యంతో మహిళ..

మొయినాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన సస్మిత జగన్నాథ్(28) మూడేళ్లుగా నజీర్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటోంది. ఆమె కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబీకులు ఉస్మానియా దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

యువకుడిపై కత్తితో దాడి

బెజ్జంకి, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ యువకుడిపై కత్తితో దాడిచేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కృష్ణారెడ్డి సమాచారం ప్రకారం.. బెజ్జంకికి చెందిన సోమని ప్రవీణ్ కొద్ది నెలలుగా కొరుట్లలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన పలువురి వద్ద కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకుండా ఆలస్యం చేస్తున్నాడని గ్రామానికి చెందిన వెల్పుల శ్రీను, వెల్పుల శ్రీకాంత్, వెల్పుల వంశీ, మరికొందరితో కలిసి గురువారం కారులో హైదరాబాద్ వెళ్తున్న ప్రవీణ్‌ను తోటపల్లి వద్ద ఆపారు. కత్తితో దాడిచేసి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలగోకులం.. సత్ప్రవర్తనకు మార్గం


చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

వికారాబాద్ జిల్లాలో వ్యాపార, వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరులో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న బాలగోకులం చిన్నారి విద్యార్థుల్లో సత్ప్రవర్తన, దేశభక్తి పెంపొందేందుకు దోహదపడుతోంది. తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవాన్ని చూపేలా చేస్తుంది. మూడేళ్ల కిందట కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టణ శివారులో ఒక చోట బాలగోకులాన్ని నిర్వహించారు. ప్రారంభంలో కొంతమంది పిల్లలే వచ్చారు. వారికి ఉపాధ్యాయులు ఆధ్యాత్మికం, దేశభక్తి, సమాజంలో మెలిగే తీరు, తదితర అంశాలను బోధించారు. ఇవన్నీ తల్లిదండ్రులకు నచ్చడంతో తమ పిల్లలను ఇక్కడికి పంపించే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇక్కడ విజయవంతమైన బాలగోకులాన్ని పట్టణంలో విస్తరించాలని ఉపాధ్యాయులు నిర్ణయించారు. ఇలా ప్రస్తుతం మూడు చోట్ల ప్రతి ఆదివారం బాలగోకులం నిర్వహిస్తుండటం విశేషం.

ఆలయాలే వేదికగా..: ఆలయాలే వేదికగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. బసవేశ్వరనగర్‌లోని చెరువెంటి ఈశ్వరుడు, భవానీనగర్‌లోని రామలింగేశ్వరుడు, తులసీనగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయాల వేదికగా జరుగుతున్నాయి. ముందుగా పిల్లలతో పూజలు, హారతి ఇప్పిస్తారు. రామాయణ, మహాభారత శ్లోకాలు నేర్పిస్తారు. నీతికథలు చెబుతారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం ఎలాగో నేర్పిస్తారు. అదే సమయంలో కుల, మతాలు లేని స్నేహం గురించి వివరించడంతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. చదువుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తారు. పిల్లలు భవిష్యత్తులో సత్ప్రవర్తన కలిగి ఉండటం, ఉన్నత స్థాయికి ఎదగడం, సమాజం పట్ల సదాభిప్రాయం, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించే లక్షణాలను దృష్టిలో పెట్టుకొని బాలగోకులం నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వరూప, శివకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆనందం తెలిపారు.

- న్యూస్‌టుడే, తాండూరు

గజ్వేల్.. మంత్రుల రాకతో జిగేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం, ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గురువారం రావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. సభలో మంత్రుల ప్రసంగాలకు హాజరైన వారు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. బోనాలు, కోలాటాలతో కళాకారులు ప్రదర్శన చేపట్టారు. గజ్వేల్ పట్టణమంతా ఒక్కసారిగా ముగ్గురు మంత్రులు రావడంతో సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, గజ్వేల్


గజ్వేల్‌లో ప్రజ్ఞాపూర్ నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలో పార్టీ శ్రేణులు


ర్యాలీలో బోనాల ఊరేగింపు, కోలాటం, ఒగ్గు కళాకారుల ప్రదర్శన

ఉన్నతీకరించి.. ఉపయోగమేది?

మినీ అంగన్‌వాడీల్లో జాడ లేని జీతభత్యాల పెంపు

న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట, పరిగి


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వెయ్యి జనాభా ఉన్న ప్రాంతంలో ప్రధాన కేంద్రం, అంతకంటే తక్కువ జనాభా ఉంటే మినీ అంగన్‌వాడీలను నెలకొల్పింది. అయితే మినీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెరగడంతో అక్కడ అందించే సేవలు ఇబ్బందికరంగా మారాయి. ఆయాలు నియామకాలు లేకపోవడంతో, అంగన్‌వాడీ టీచర్లే నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం గత జనవరిలో మినీ కేంద్రాలను ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సమస్యలు పరిష్కారం అవుతాయని అంతా భావించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఉత్తర్వులతో పరిమితం..

రాష్ట్రవ్యాప్తంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఏడెనిమిది నెలల కిందట ఇచ్చిన ఉత్తర్వులు కాగితాలకే పరిమితమయ్యాయి. చాలా చోట్ల శాశ్వత భవనాలు కరవు అవ లేదు. పిల్లలను ఆడించేందుకు ఆట వస్తువులు, ఇతర సామగ్రి కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాలేదు. కేవలం సరుకులు, సిబ్బందితో కేంద్రాలను నెట్టుకొస్తున్నారు.

- కేంద్రాలకు పక్కా భవనాలు లేక పాఠశాలల అదనపు గదులు, సామాజిక, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మినీ కేంద్రాల్లో ఆయా పోస్టులు అవసరం. వీటి భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించినా ఇప్పటివరకు అడుగు పడలేదు. ఒక్కో మినీ కేంద్రంలో ఒక్కో టీచరు పని చేస్తుండగా ప్రతి నెలా రూ.7,800 చొప్పున వేతనం అందిస్తున్నారు. కేంద్రాల ఉన్నతీకరణ తర్వాత రెండు నెలలు టీచర్లకు పెంచిన జీతాలు రూ.13,650 చొప్పున అందజేసి, ఆ తర్వాత నిలిపివేశారు.

విడుదల కావాల్సి ఉంది:

మినీ కేంద్రాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. రెండు నెలలు పెంచిన జీతాలు టీచర్లకు అందించాం. బడ్జెట్ కేటాయింపు లేక మళ్లీ పాత వేతనాలే జమవుతున్నాయి. పెంచిన వేతనాలు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

బ్రహ్మాజీ, మహిళ, శిశు సంక్షేమాధికారిణి, మెదక్

నాలుగు జిల్లాల్లో వివరాలు..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన	మినీ
మెదక్	1,076	191
సంగారెడ్డి	1,444	160
సిద్దిపేట	1,084	66
వికారాబాద్	757	350

అత్యాచార నిందితుడిని శిక్షించాలి: ప్రభుత్వ విప్

చేర్యాల: కొమురవెల్లి మండలం గురువన్నపేటలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం డిమాండ్ చేశారు. కురుమ సంఘం ప్రతినిధుల బృందం గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సిద్దిపేటకు వెళ్లి సీపీ అనురాధకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు క్యామ మల్లేశ్, నాయకులు ఉన్నారు. బాలిక విద్య వరకు అండగా బాధ్యత తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు.

చికెన్ ధరలు

ఫారంరేటు	112–00
రిటైల్	134–00
డ్రెస్డ్	194–00
స్కిన్‌లెస్	221–00

జమ్మిమొక్క నాటడం సంతోషకరం


మొక్క నాటుతున్న శుభప్రద్‌పటేల్

వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: మొక్కలు నాటడం సంతోషకరమైన విషయమని రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ కుమార్ పిలుపు మేరకు మొక్కలు నాటుతున్నామని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ అన్నారు. 'గుడి గుడికో జమ్మిచెట్టు' కార్యక్రమంలో భాగంగా గురువారం అనంతగిరి పద్మనాభస్వామి ఆలయ ప్రాంగణంలో జమ్మిమొక్కను నాటారు. కార్యక్రమంలో చైతన్య కేదార్‌నాథ్, దామగుండం నేవీ ప్రాజెక్టు వ్యతిరేక జేఏసీ నాయకుడు సత్యానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని కుల్కచర్ల ఎంపీవో భాస్కర్‌గౌడ్ అన్నారు. పుట్టాపహడ్‌లో మురుగు కాలువలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున ఈగలు, దోమలు వ్యాప్తిచెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, మాజీ వైస్ ఎంపీపీ రాజశేఖర్ గౌడ్, వెంకట్రాములు, శ్రీనివాస్ రెడ్డి, రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు

నీరు కలుషితం.. వ్యాధుల భయం!

● పరిగి, కొడంగల్ పురపాలికల్లో దృష్టి సారిస్తే మేలు

న్యూస్‌టుడే, పరిగి, కొడంగల్:

పురపాలికల్లో ఎద్దడి సమస్య నేటికీ తీరడం లేదు. పాతకాలం నాటి పైపులైన్లు తరచూ లీకేజీలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒక చోట మరమ్మతు చేస్తుండగానే మరో ప్రాంతంలో ఇబ్బందులు కలుగుతున్నాయి. వీటి కోసం అధికారులు ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. అయినా పరిస్థితులు చక్కబడటం లేదు. వర్షాకాలం కావడం, అపై నీటి కలుషితంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రోగాల బారిన పడుతున్నామని శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నా.. అవి సరిపడక ఇతర బోర్ల నుంచి రెండింటిని కలిపి పంపిణీ చేయాల్సి వస్తోంది. పరిస్థితులను చక్కదిద్దేందుకు పట్టణ ప్రణాళికలు రూపొందించాలని చెబుతున్నారు. అమృత్ -2 పథకం కింద పరిగిలో రూ.14.5కోట్లు ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసింది. దీంతో టీచర్స్ కాలనీ, బస్టాండు ఏరియా, తిరుమల వెంచర్, శ్రీనివాస


కలుషితమవుతున్న నీరు

కాలనీల్లో భూ ఉపరితల ట్యాంకులను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇవి ప్రారంభిస్తే ఎద్దడి సమస్యకు పరిష్కారం లభించనుంది. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో మెరుగైన సరఫరా జరుగుతుంది.

శరవేగంగా కొత్త కాలనీలు

పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మున్సిపాలిటీలు ముందస్తు వ్యూహ రచనతో పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీ ఆవిర్భవించి ఆరేళ్ల నాటికి సుమారు పాతిక జనాభా పెరిగిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న కాలంలోనూ ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఈమేరకు నిధుల కేటాయింపు జరగాలని ఆశిస్తున్నారు. మేజర్ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా మారిన తరువాత స్థానికంగా ఉండేందుకు ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈకారణంగా కొత్త కాలనీలు ముమ్మరంగా ఏర్పాటవుతున్నాయి.

సరఫరాను మెరుగు పరుస్తాం

లీకేజీలను సత్వరం అరికడుతున్నాం. ఎక్కుడైనా పైపులైన్లు దెబ్బతిని నీరు వృథాగా పోతుంటే వెంటనే సమాచారం అందిస్తే సరిచేయిస్తాం. తాగునీరు వృథా కాకుండా బిరడాలు ప్రతి ఒక్కరూ బిగించుకుని పొదుపు చర్యలు పాటించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కనెక్షనులు కత్తిరిస్తాం.
– బలరాంనాయక్, వెంకటయ్య, పుర కమిషనర్లు, కొడంగల్, పరిగి

మున్సిపాలిటీ	వైశాల్యం (చ.కిమీ)	వార్డులు	జనాభా	కుళాయి కనెక్షన్లు	బోర్లు	నీటి సరఫరా లీటర్లు లక్షల్లో
కొడంగల్	36.02	12	18,505	3951	9	2.75
పరిగి	20.07	15	27,650	5515	66	16

అండర్ 14 క్రికెట్ పోటీల్లో కొడంగల్‌కు మొదటి బహుమతి

కొడంగల్, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి క్రికెట్ పోటీల్లో కొడంగల్ జట్టు మొదటి బహుమతి సాధించింది. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 68వ స్కూల్ స్థాయి ఫెడరేషన్ అండర్ 14 క్రికెట్‌లో పోటీల్లో కొడంగల్ జట్టు జిల్లా స్థాయి మొదటి స్థానం పొందినట్లు తెలిపారు.

ఉద్యోగ నియామకాల్లో యువకుడి ప్రతిభ

కొడంగల్, న్యూస్‌టుడే: అన్నారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఒకే సారి నాలుగు ఉద్యోగాల్లో ప్రతిభ పొందారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో తెలంగాణలో సోషల్ స్టడీస్‌లో 2వ ర్యాంగు, వికారాబాద్ జిల్లాలో 9వ ర్యాంకు సాధించారు. ఇటీవల వెలువడిన టీజీటీ, పీజీటీ, హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగాల్లో జోనల్ స్థాయిలో 6వ ర్యాంకు, 17వ ర్యాంకులు సాధించారు. ఒక్క ఉద్యోగం వస్తే చాలు అనుకొనే ఈ రోజుల్లో నాలుగు ఉద్యోగాలు పొందిన అందరికి ఆదర్శంగా నిలిచారు.

ఠాణా ఎదుట మేస్త్రి ఆత్మహత్యాయత్నం

తాండూరు(గ్రామీణ, న్యూస్‌టుడే: తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించడం లేదని మనస్తాపం చెందిన మేస్త్రి ఠాణా బయట ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన అనిల్‌కుమార్ అనే మేస్త్రి తాండూరు మండలం సిరిగిరిపేటలో యాదయ్య ఇంటి నిర్మాణ పనులు చేసేందుకు రూ.1.15లక్షలతో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం కంటే అదనంగా పనులు చేశానని తనకు మరింత నగదు చెల్లించాలంటూ పలుమార్లు యాదయ్యను కోరాడు. దానికి నిరాకరించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. తనకు డబ్బులు ఇప్పించాలంటూ గౌతాపూర్ శివారులోని పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు యాదయ్య పిలిచి ఆరా తీయగా తాను చెల్లించిన నగదు వరకే పనులు చేశాడని, అదనంగా డబ్బులు ఇచ్చేదిలేదన్నారు. అనిల్‌కుమార్ గురువారం యాదయ్య ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు ఇవ్వాలంటూ నిలదీశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్దాం అక్కడే తేల్చుకుందామంటూ.. ఇద్దరు ఠాణా వద్దకు వచ్చారు. కొద్దిసేపటికి యాదయ్య అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన అనిల్‌కుమార్ తన వెంట తెచ్చుకున్న స్పిరిట్ తాగి ఠాణా లోపలికి వెళ్లి నేను చనిపోతే మీరే బాధ్యులని సిబ్బందితో అన్నాడు. వెంటనే పోలీసు సిబ్బంది చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను గురువారం ఠాణాలో లేనని ఇటీవల ఈ విషయంపై ఇంటి యజమానితో మాట్లాడమని తెలిపారు.

పింఛన్ పథకానికి ఆదరణ కరవు

● రైతులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనం

న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ, దోమ:

వృద్ధాప్యంలో అన్నదాతలకు ఆసరాతో పాటు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రారంభించిన 'పీఎం కిసాన్ మాన్‌ధన్ పెన్షన్ యోజన' (పీఎం-కేఎంవై)కు స్పందన కరవైంది. ఈ పథకం భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులందరికీ వర్తిస్తుంది. జిల్లాలో సుమారు 50 వేల మందికి పైగా అర్హులైన రైతులుండగా.. ఇప్పటి వరకు 1,000 మంది మాత్రమే పథకాన్ని వినియోగించుకుంటున్నట్లు సమాచారం. రైతులకు ఈ పథకం గురించి అవగాహన లేక అర్హత ఉన్నా.. లబ్ధి పొందడం లేదు.


పత్తిచేలో మందును పిచికారీ చేస్తున్న రైతు

పథకం వివరాలివీ..

ఈ పథకంలో చేరే రైతులు వయస్సును బట్టి ప్రీమియం డబ్బులు కట్టాల్సి ఉంటుంది. 18 నుంచి 40 ఏళ్ల వయస్సున్న రైతులు (60 ఏళ్ల వరకు) తన వాటాగా రూ.55 నుంచి రూ.200 వరకు సాధారణ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)కు చెల్లించాలి. లబ్ధిదారుడు ఎంత కడతారో అంతే మొత్తాన్ని బీమా కంపెనీకి ప్రభుత్వం తరపున కలిపి జమ చేస్తుంది ఈ ప్రీమియాన్ని తమకు అనుకూలతను బట్టి జమచేసే సదుపాయం ఉంది. ఈ పథకంలో చేరిన రైతులు 60 ఏళ్లు నిండిన వెంటనే నెలనెలా రూ.3వేల పింఛన్ అందిస్తారు. ఒకేసారి డబ్బులు కావాలనుకుంటే చెల్లించిన మొత్తంలో సగం డబ్బులను అందజేస్తారు. పథకంలో చేరిన రైతు మరణిస్తే జీవితభాగస్వామి కొనసాగించవచ్చు.

చేరాలిలా..

రైతులు తమ ఆధార్, ఫొటో, పట్టాపాసు పుస్తకం ప్రతులు, మొబైల్ నంబరు తదితర వివరాలతో పీఎంకేఎంవై పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. నిర్వాహకులు ప్రత్యేక పింఛను ఖాతాకు సంబంధించిన కార్డును అందజేస్తారు. దరఖాస్తు రుసుం రూ.30 కూడా నిర్వాహకులకు ప్రభుత్వమే చెల్లిస్తుంది.

అర్హులు వీరే..

18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సున్న పీఎం కిసాన్ డబ్బులు పొందే రైతులందరూ అర్హులే. ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, ఇంజినీర్లు, ఇతరత్రా వృత్తి నిపుణులు ఈ పథకానికి అనర్హులు. ఆదాయపన్ను చెల్లిస్తూ.. ఎక్కువరాబడి పొందుతున్న వారితోపాటు ఇతర ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందుతున్న వారు పనికిరారు.

వ్యవసాయ శాఖకు సంబంధం లేదు..

ప్రభాకర్‌రావు, దోమ వ్యవసాయాధికారి

ఇది కేంద్ర ప్రభుత్వ పథకం.. వ్యవసాయ శాఖకు సంబంధంలేదు. రైతులు నేరుగా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటారు. (లీడ్) బ్యాంకు వారికి మాత్రమే ఈ పథకం అమలు వివరాలు, సమాచారం తెలుస్తోంది.

తిరుపతి బ్రహ్మోత్సవాలకు జిల్లా కళాకారులు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తిరుమల, తిరుపతి బ్రహ్మోత్సవాలకు వికారాబాద్ జిల్లా కళాకారులు ఎంపిక య్యారు. ఈ నెల 4 నుంచి 12 దాకా టీటీడీలో నిర్వహిస్తున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో జిల్లా కళాకారులు ప్రదర్శన చేయటానికి ఎంపిక య్యారు. తాండూరుకు చెందిన నృత్య శిక్షకుడు అశోక్ ఆధ్వర్యంలో 80 మంది నృత్య కళాకారులు కొండ మీద తెలంగాణ జానపద, గుస్సాడీ, లంబాడీకోయ, పులి వేశం, ధింసా నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. వికారాబాద్, తాండూరు, బంట్వారానికి చెందిన కళాకారులు బ్రహ్మోత్సవాలలో 7, 8 తేదీల్లో ఉదయం, సాయంత్రం రెండు పూటలు ప్రదర్శన ఇస్తారని శిక్షకుడు తెలిపారు.


ఎంపికైనా కళాకారులు

వేదికపై తప్పిన ప్రమాదం

తాండూరు(గ్రామీణ, న్యూస్‌టుడే: కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో గాజీపూర్‌కు చెందిన, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ నారాయణరెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. సమావేశ వేదికపై కుర్చీ ఒక్కసారిగా కిందపడింది. అందులో కూర్చున్న మాజీ ఛైర్మన్ కిందపడబోతుండగా వెంటనే అప్రమత్తమైన కాంగ్రెస్ నాయకులు, పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. వేదికపైనున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితోపాటు ముఖ్యనాయకులు ఒక్కసారిగా పైకిలేచి పరిశీలించారు. ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

6న ముదిరాజ్ మహాసభ

పరిగి: వికారాబాద్‌లో ఈనెల 6న ముదిరాజ్ మహాసభ జిల్లా ముఖ్యనాయకుల సమావేశం జరగనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, మాణిక్యం, ఉపాధ్యక్షుడు రాములు తెలిపారు. పరిగిలో గురువారం జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

నిబంధనలు పాటించని బడులపై చర్యలు తీసుకోండి

వికారాబాద్ మున్సిపాలిటీ: వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులు నడుపుతున్నారని ఈ పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అక్బర్, సతీష్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పాఠశాలలను పరిశీలించామని విద్యార్థులతో తరగతులు కొనసాగుతున్నాయని వారు అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు తేజ కార్తిక్, రెహన్ ప్రవీణ్ పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

మర్పల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నిర్వహించిన భాజపా సభ్యత నమోదు కార్యక్రమానికి రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ అభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. భాజపా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్వర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా, మండల నాయకులు నాగయ్య, బలరాం గౌడ్, శ్రీమంత్, జైపాల్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం

కొడంగల్, దౌల్తాబాద్: కొండచిలువను చూసి ప్రయాణికులు ఆందోళన చెందారు. దౌల్తాబాద్ మండలం చంద్రకల్ శివారులో రోడ్డు పై ఒక్కసారిగా ప్రత్యక్షమైంది. సుమారు 6 ఫీట్ల పొడవు, లావుగా ఉండటంతో పశువుల్ని మింగే అవకాశం ఉందని గ్రామస్థులు భావించారు. సమాచారాన్ని అటవీశాక అధికారులకు అందించారు. బీట్ అధికారి రాము దాన్ని అటవీ ప్రాంతానికి తరలించారు.

లబ్ధిదారులకు పత్రాల పంపిణీ

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకంలో భాగంగా లబ్ధిదారులకు గురువారం పత్రాలు అందించారు. పరిగి మండలం మిట్టకోడూరు, గోవిందాపూర్, లఖ్నాపూర్, చిగురాల్‌పల్లి తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల కార్యదర్శులు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పరశురాంరెడ్డి, డీసీసీ కోశాధికారి శశిధర్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు తాావ్యానాయక్, నాయకులు రాజపుల్లారెడ్డి, పర్వత్‌రెడ్డి పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాలు

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో. అంటూ బుధవారం రాత్రి, గురువారం మహిళలు అడిపాడారు. స్థానిక శివాజీ నగర్‌లో సంబరాలను నిర్వహించారు.

● ఓం శాంతి భవనం, ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆడపడుచుల ఆనందోత్సాహాలు, ఆటపాటల మధ్య అటుకుల బతుకమ్మ పండుగ సంబురాలు రెండో రోజు నిర్వహించారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: డీఎస్పీ


గౌరవ వందనం చేస్తున్న ఎస్సై తదితరులు

పూడూరు, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి సూచించారు. చన్‌గోముల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం డీఎస్పీ సందర్శించారు. కేసుల నమోదు, దస్త్రాల నిర్వహణకు సంబంధించి పరిశీలించారు. కేసుల పురోగతి సకాలంలో ఛేదించాలని అన్నారు. ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మధుసూదన్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

తాండూరు టౌన్: సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటంతో నేరాలు నియంత్రించటానికి అవకాశాలు ఉంటాయని తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని పలు వ్యాపారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ప్రతి వ్యాపార సముదాయాల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వైద్యుడి పనితీరుపై ఆగ్రహం

పరిగి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం వెళ్తే విధుల్లో ఉన్న వైద్యుడు తమను సరిగా పట్టించుకోలేదని మల్కాపూర్ గ్రామస్థులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు.. సయ్యద్‌మల్కాపూర్‌కు చెందిన శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఇతడిని గ్రామస్థులు, స్నేహితులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రథమ చికిత్స చేసే సమయంలో డాక్టర్ ప్రవీణ్ ఇక్కడి నుంచి త్వరగా ఉస్మానియాకు తీసుకెళ్లండని చెప్పడంతో ఇక్కడే వైద్యం ఎందుకు చేయరని వారు ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. పరిస్థితి ప్రమాదకరంగా ఉందని అందువల్లే వెళ్లమని సూచించినట్లు సదరు వైద్యుడు సమాధానమిచ్చారు. క్షతగాత్రుని పట్ల వైద్యుడి ప్రవర్తన సరిగా లేదని ఆరోపించారు. దీంతో వైద్యుడి సమాచారంతో పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు ఇరువురిని సముదాయించడంతో పరిస్థితి చక్కబడింది. తాను సెలవులో ఉన్నానని జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్ తెలిపారు.

పేదల ఆరోగ్యానికే వైద్యశిబిరం

పూడూరు: పేదల ఆరోగ్యం కోసమే ప్రతివారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సాయి ఓరల్‌హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ ఏఎస్ నారాయణ చెప్పారు. పూడూరు సాయి మందిరంలో గురువారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. నేత్రాలు, దంతాలతో పాటు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు ఉచితంగా అందజేశారు. కంటికి శస్త్ర చికిత్సలు అవసరమున్న 14 మందిని గుర్తించి నగరానికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నరేందర్, సౌమ్య సిబ్బంది అన్వర్, గోపాల్ ఉన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశామని తైక్వాండో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక తేజ ఫంక్షన్ హాల్‌లో టోర్నమెంట్‌లో పాల్గొనడానికి విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్ 14, అండర్ 17 బాలబాలికలను జిల్లా స్థాయిలో ఎంపిక చేశామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాఘవన్‌నాయక్, మాజీ కార్యదర్శి అనంతయ్య, నర్సింహులు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: మాజీ ఎమ్మెల్యే

కుల్కచర్ల గ్రామీణ: కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి అన్నారు. పుట్టాపహడ్‌లో భారాస కార్యకర్త అంజిలయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో రైతుబంధు మాజీ మండల అధ్యక్షుడు రాజు ఉన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత


కుల్కచర్ల, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా గుంతలు పడి అధ్వానంగా తయారైన మట్టి రహదారిని బాగు చేయించారు. ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి గుంతల్లో పోయించారు. రహదారికి ఇరువైపులా పెరిగి. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి కనిపించేది కాదు. దీంతో ఈ పొదలను కూడా కార్యదర్శి తొలగింప చేశారు. దీంతో రహదారి కొంత మేర బాగు పడటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

పూల రైతుకు పండగ

దసరాతో కలిసి వచ్చిన ధర

న్యూస్‌టుడే, పూడూరు

తెలుగు సంస్కృతీ, సంప్రదాయాల్లో దసరా పండుగకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ నెల 12న పండుగ ఉండటంతో మొదటి వారం నుంచే వాడవాడల్లో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. తీరొక్క పూలను తెచ్చి బతుకమ్మలను పేరుస్తారు. ఇప్పటి వరకు ధరలు లేక నిరాశ చెందిన విరుల రైతులు పండుగ నేపథ్యంలో ధరలు పెరుగుతుండడంతో ఊరట చెందుతున్నారు.


పూడూరులో సాగులో ఉన్న బంతి

సాగుకు ముందే ప్రణాళిక

సాధారణంగా ఏటా అక్టోబరు నెలలో దసరా, దీపావళి పండుగలు వస్తాయి. దీంతో పాటు నవంబరు, డిసెంబరు నెలల్లో కార్తిక మాసం సందర్భంగా వివిధ శుభ కార్యాలు, విందులు, వివాహాలు, గృహప్రవేశాలు అనేకం ఉంటాయి. అయ్యప్ప మాలాధారులు పడిపూజలు నిర్వహిస్తారు. దీంతో ఈ సీజన్‌లలో పూలకు డిమాండ్ విపరీతంగా ఉంటుంది. పంట కాలం అంచనా వేసుకుని అందుకు కోత వచ్చే విధంగా ఈ ప్రాంతంలో రైతులు ముందే ప్రణాళిక ప్రకారం సమాయత్తం అవుతారు. వర్షాధారంతో పాటు బోరు బావులు, చెరువులు, కుంటల అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించుకుని సాగు చేపట్టారు.

దాదాపు 2.5 వేల ఎకరాల్లో..

పూడూరు, మర్పల్లి, మోమిన్‌పేట్, పరిగి, ధారూర్, నవాబ్‌పేట, వికారాబాద్ తదితర మండలాల పరిధిలో పూల సాగు ఎక్కువగా ఉంటుంది. సాధారణ గులాబీ, సెంటు గులాబీ, బంతి, చామంతి, పచ్చ బంతి, కుంకుమ బంతి, ఆస్టర్. తీగ జాతులు కనకాంబరాలు, కాకడాలు మల్లెలు వంటి అనేక రకాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 2,500 ఎకరాకు పైగానే సాగవుతున్నట్లు ఉద్యాన అధికారులు వెల్లడించారు.


చామంతి కోస్తున్న రైతులు

చామంతి కోతకు వచ్చింది

మేకల గోపాల్, రైతు మేడికొండ

బోరు వద్ద మూడు ఎకరాలు ఉండగా ప్రస్తుతం ఎకరంలో చామంతి బలెలో రకం నారు నాలుగు నెలల క్రితం వేశాను, ఒక్కో నారు మొక్క రూ.1.50 చెల్లించి నాగర్ గూడ నర్సరీ నుంచి తెచ్చాను. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ఇప్పుడే కోతకు వచ్చింది పెట్టుబడి కోసం ఇప్పటి వరకు రూ. 45 వేలు ఖర్చయింది. ఇదే ధర కొనసాగితే రూ. 50 వేల నుంచి రూ.80 వేల వరకు లాభం వచ్చేందుకు అవకాశం ఉంది.

ధరల వ్యత్యాసం కిలో చొప్పున (రూ.లలో)

	వారం క్రితం	ప్రస్తుతం
గులాబీలు	40	80-100
చామంతి	10	100
కనకాంబరాలు	150	500
బంతి	10	50-60
మల్లెపూలు	120	400
ఆస్టర్	20	50
కాకడాలు	200	350

వర్షాలకు బంతి దెబ్బతింది

నర్సింహాచారి, మీర్జాపూర్

బావి వద్ద ఖరీఫ్ ప్రారంభంలో ఆరు వేల బంతి నారు వేశాను, వినాయక చవితి దసరా పండుగ సీజన్‌లో కోతకు రావాల్సి ఉంది. పెట్టుబడి కోసం ఇప్పటి వరకు రూ.28 వేల వరకు ఖర్చయింది. గత నెలలో వర్షాలు విపరీతంగా కురవడంతో పంట దెబ్బతిని ఆశించిన దిగుబడులు రాలేదు. ధర కూడా లేక పోవటంతో నష్టాలు వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధర పలుకుతుండటంతో ఉన్న కొద్ది పంటతో ఊరట లభిస్తుంది.

కొలువు దీరిన అమ్మవారు


దోమలో దుర్గాదేవిని తీసుకువస్తున్న గ్రామస్థులు

దుర్గాదేవి నవరాత్రి ప్రతిష్ఠాపనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పుల చప్పుళ్లు, బాజా భజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో అమ్మవారు కొలు దీరారు. పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మొదటి రోజు స్వర్ణ కవచాలంకృత రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తాండూరులో వ్యవసాయ విపణి అధ్యక్షుడు పట్లోళ్ల బాల్‌రెడ్డి దంపతులు, కౌన్సిలరు నీరజ వరసిద్ధి వినాయక దేవాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిగిలో బాలత్రిపుర సుందరిదేవిగా దర్శనం ఇచ్చిన అమ్మవారికి స్థానికులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, బృందం

పకడ్బందీగా సర్వే చేయాలి

మర్పల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం పంపిణీ చేసే కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో కుటుంబ వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి సుధీర్ అన్నారు. గురువారం మండలంలోని కుడుగుంట గ్రామంలో నిర్వహించిన సర్వేలో పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ రాజమల్లయ్య, మండల పార్టీ అధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు.